ఆర్అండ్‌బీ స్థలం ఆక్రమణ

- అధికార పార్టీ నాయకుల అండదండలతోనే
- దర్జాగా దుకాణాల నిర్మాణం
- ఫిర్యాదు చేసినా స్పందించని అధికారులు


పత్తికాయవలస జంక్షన్ వద్ద ఆర్అండ్‌బీ స్థలంలో నిర్మిస్తున్న దుకాణాలు

చీపురుపల్లి: ఆక్రమణకు కాదేదీ అనర్హం అన్నట్లు కొందరు రెచ్చిపోతున్నారు. ఎక్కడ ప్రభుత్వ స్థలం కనిపిస్తుందా అందులో పాగా వేసేద్దామా అంటూ ఇష్టారాజ్యంగా ఆక్రమణలకు పాల్పడుతున్నారు. అధికార పార్టీ అండదండలు ఉండడంతో ఆక్రమణదారులకు అడ్డు అదుపూ లేకుండా పోతోంది. ఆక్రమణలను అడ్డుకుని ప్రభుత్వ ఆస్తులను పరిరక్షిం చాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఆక్రమణలపై రెవెన్యూ, ఆర్అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ వారిలో చలనం లేకపోవడం సర్వత్రా విమర్శలకు దారితీస్తోంది. అధికార పార్టీ అండదండలు ఉంటే భవిష్యత్‌లో ప్రభుత్వ కార్యాలయాలను ఆక్రమించినా సరే అధికారులు పట్టించుకునే పరిస్థితి ఉండదనే చర్చ జరుగుతోంది. దీనికి చక్కని ఉదాహరణగా మండలంలోని పత్తికాయవలస జంక్షన్‌లో ఆర్అండ్‌బీ స్థలంలో అక్రమ కట్టడాలు నిలుస్తున్నాయి.

విలువైన స్థలంలో ఆక్రమణలు....

చీపురుపల్లి నుంచి శ్రీకాకుళం వెళ్లే ప్రధాన రహదారిని ఆనుకుని పత్తికాయవలస జంక్షన్ వద్ద ఆర్అండ్‌బీ స్థలంలో అధికా ర పార్టీ అండదండలతో అదే గ్రామానికి చెందిన కొంతమంది ఆక్రమణలకు పాల్పడ్డారని గ్రామస్థులు చెబుతున్నారు. ఆర్అండ్‌బీ స్థలంలో దాదాపు 10 నుంచి 12 దుకాణాలు నిర్మిస్తున్నారు. నిర్మాణాలు పూర్తికాకపోముందే ఒక్కో దుకా ణాన్ని ముందుగానే రూ.2 లక్షలు చొప్పున అమ్మకాలు కూడా చేస్తున్నట్లున మాచారం. ఇలా ఆర్అండ్‌బీ స్థలాన్ని అక్ర మించి కట్టడాలు జరిపితే భవిష్యత్‌లో రహదారి విస్తరణ జరిగే సమయంలో పరిస్థితి ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నా రు.ఆక్రమణలపై ఆ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రెవెన్యూ, ఆర్అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించు కోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయితే ప్రస్తుతం అక్రమ కట్టడాలు జరుపుతున్న ఆర్అండ్‌బీ స్థలం లావేరు మండల పరిధిలో ఉండడంతో అక్కడి అధికారులకు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.

ఫిర్యాదు చేశాం..

ఆర్అండ్‌బీ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతుండడంపై రెవెన్యూ, ఆర్అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేశాం. తక్షణమే అక్రమ కట్టడాలు నిలిపివేసి ఆర్అండ్‌బి స్థలాన్ని పరిరక్షించాలని కోరారు. అధికారులు స్పందించి, ఆక్రమణలను అడ్డుకోవాలి.

– పట్టా ఎల్లయ్య,
మాజీ సర్పంచ్, పత్తికాయవలస

మంచి అలవాట్లు నేర్చుకోండి



విద్యార్థులు మంచి అలవాట్లు నేర్చుకోవాలని శ్రీనివాస జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఏ.డి.ఎస్.వి.ప్రసాద్ అన్నారు. నేషనల్ హాబీ మంత్‌ను పురస్కరించుకుని గురువారం ఆ కళాశాలలో చదరంగం ఆటపై 80 దేశాల్లో విడుదల చేసిన తపాలా బిళ్లలు, పోస్టర్ కవర్ల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో చదరంగంపై ఆసక్తి పెంచాలనే ఉద్దేశంతో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. కళాశాల అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

– చీపురుపల్లి

అనాథ పిల్లలకు దుస్తుల పంపిణీ



గజపతినగరంలోని బాలసదన్‌లో చదువుకుంటున్న 24మంది అనాథ పిల్లలతో పాటు మండలంలోని వివిధ ప్రాంతాలకు చెందిన తల్లిదండ్రులు లేనటువంటి 12మంది పిల్లలకు ఎస్సీ ప్రాథమిక పాఠశాల వద్ద ఎంఈఓలు విమలమ్మ,సాయిచక్రధర్ గురువారం దుస్తులు పంపిణీ చేశారు. ఎంఈఓ విమలమ్మ మాట్లాడుతూ సంక్రాంతి నేపథ్యంలో అనాథ పిల్లలకు దుస్తులు అందజేసేందుకు సహకరించాలని జిల్లా విద్యాశాఖ అధికారి కోరడంతో పలువురు ఉపాధ్యాయులు, దాతలు స్పందించారని చెప్పారు. దాతల ఆర్థిక సహాయంతో జిల్లాలో తల్లిదండ్రులు లేని పిల్లలకు దుస్తులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

– గజపతినగరం

ప్రకృతి వ్యవసాయమే మేలు



పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయమే అన్ని విధాలా మేలని ప్రకృతి వ్యవసాయ రీజనల్ అధికారి హేమసుందర్ అన్నారు. వేపాడ మండలంలోని కుమ్మపల్లి గ్రామంలో రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ముందుగా గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానంతో సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. అనంతరం జిల్లేడు, అగ్నిఅస్త్రం, ద్రవజీవామృతాలు, కషాయాల తయారీని ప్రయోగపూర్వకంగా వివరించారు. మామిడి సాగులో పాటించాల్సిన సస్యరక్షణ చర్యలను సూచించారు. డీఎల్ఎంపీ ఆర్.విస్వావినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

– వేపాడ

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి రంగోత్సవాలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బొండపల్లి: రాష్ట్రస్థాయి రంగోత్సవ పోటీలకు గొట్లాం ఉన్నత పాఠశాలకు చెందిన అయిదుగురు విద్యార్థులు ఎంపికయ్యారని ఆ పాఠశాల హెచ్ఎం శ్రీరామాచారి గురువారం తెలిపారు. ఈనెల 7వ తేదీన జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి రంగోత్సవ పోటీల్లో రోల్‌ప్లే విభాగంలో విద్యార్థులు సీహెచ్.చరణ్, ఎం.భార్గవ్, టి.అఖిల్, బి.అజయ్ మహనోహర్,స్లోగన్ విభాగంలో కె.జగదీశ్వరీ ఉత్తమ ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈనెల 24న విజయవాడలో నిర్వహించనున్న పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని హెచ్ఎం చెప్పారు.విద్యార్థులను హెచ్ఎంతో పాటు పీడీ యు.సత్యానంద్, ఉపాధ్యాయులు అభినందించారు.

రక్తదాన శిబిరం


45వసారి రక్తదానం చేస్తున్న చంద్రశేఖర్‌ను అభినందిస్తున్న జిల్లా ఏరియా ఆస్పత్రి సిబ్బంది

గజపతినగరం: స్థానిక సాయిసిద్ధార్థ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో విజయనగరం ఏరియా ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం రక్తదా న శిబిరం నిర్వహించారు. కళాశాల విద్యార్థులు, సిబ్బందితో పాటు స్థానిక యువకులు 55 మంది రక్తదానం చేశారు. 45వసారి రక్తదానం చేసిన సాయిసిద్ధార్థ కళాశాల కరస్పాండెంట్ ఎస్.చంద్రశేఖర్‌ను అధ్యాపకులు అభినందించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ శీరం రెడ్డిపెద్దినాయుడు, వైస్ చైర్మన్ ఎస్.శారదానాయుడు, ప్రిన్సిపాల్ వెంకటరమణ, స్థానిక ఏరియా ఆస్పత్రి వైద్యురాలు మైత్రేయి పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

వేపాడ: సంక్రాంతి, తీర్థ మహోత్సవాల నేపథ్యంలో గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టరీత్యాచర్యలు తప్పవని ఎస్.కోట రూరల్ సీఐ అప్పలనాయుడు గురువారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. పండగను ప్రశాంత వాతావర ణంలో చేసుకోవాలని సూచించారు. కోడిపందేలు, పేకాట శిబిరాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని, రికార్డింగ్ డ్యాన్స్‌లు ఏర్పాటు చేసినా,ప్రోత్సహించినా చర్యలు తప్పవని పేర్కొన్నారు.

వైభవంగా అప్పన్న పల్లకీ సేవ


అప్పన్నస్వామి పల్లకీ మోస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

శృంగవరపుకోట: స్థానిక సాయిబాబా ఆలయం వద్ద సింహాద్రి అప్పన్న స్వామి పల్లకీ సేవ గురువారం వైభవంగా నిర్వహించారు. సింహాచలం దేవస్థానం నుంచి తీసుకువచ్చిన సింహాద్రి అప్పన్న స్వామి విగ్రహానికి పట్టణానికి చెందిన మొండివీధి అప్పన్న భక్తులు మేలతాళాలు, కోలాటంతో స్వాగతం పలికారు. అనంతరం నగర సంకీర్తన, పల్లకీ సేవ చేశారు. ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి విగ్రహానికి పూజలు చేసి, స్వామి వారి పల్లకీని మోశారు.అప్పన్న భక్తి పీఠంకు చెందిన రాజుస్వామి, అప్పన్న మాలధారణ భక్తులు పాల్గొన్నారు.

గ్రంథాలయ సేవా సంఘం కన్వీనర్ల నియామకం


శ్రీను,రమణకు నియామకపత్రాలు అందజేస్తున్న జిల్లా గ్రంథాలయ సేవా సంఘం సభ్యులు

కొత్తవలస: జిల్లా గ్రంథాలయ సేవా సంఘం ఆధ్వర్యంలో పని చేసేందుకు కొత్తవలస మండలానికి కన్వీనర్, కో-కన్వీ నర్ల నియామకాలను ఆసంఘం చేపట్టింది. మండల కన్వీనర్‌గా గొల్లలపాలెం గ్రామానికి చెందిన పంచకర్ల శ్రీను, కో-కన్వీనర్‌గా చీపురువలసకి చెందిన రంధి రమణను నియమిస్తూ జిల్లా గ్రంథాలయ సేవా సంఘం వ్యవస్థాపకులు అబ్దుల్ రవూఫ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శ్రీను,రమణకు సుబ్బలక్ష్మి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కనకాల శివ,అయ్యరక సంఘం నాయకుడు బి.రమేష్‌తో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు అభినందనలు తెలిపారు.

ఆదర్శ మిత్రులు

- అవయవదానానికి ముందుకొచ్చిన ఆరుగురు యువతీ, యువకులు


అవయవదానం చేసేందుకు అంగీకారం తెలియజేస్తూ దరఖాస్తులు అందజేస్తున్న యువత

చీపురుపల్లి: సామాజిక స్పృహపై సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం, నలుగురు కలిసినప్పుడు స్టేట్‌మెంట్లు ఇవ్వడం కాదు చేసి చూపించాలి అనుకున్నారు ఆ మిత్రులు. మనం చెప్పడం కాదు మరికొందరికి ఆదర్శం కావాలని భావించారు. అందుకే ఆ ఆరుగురు మిత్రులు తీసుకున్న నిర్ణయం ఎంతోమందికి ఆదర్శకానుంది. ఇంతకీ ఎవరు వారు, వారేం చేశారని అనుకుంటున్నారా. పట్టణానికి చెందిన శేషపు శ్రీసాయి, మండల చైతన్య, ముత్తా కల్యాణ్, పెద్ది వెంకటేష్, బి.సాయిరెడ్డి, పి.నందిని మిత్రులు. వీరంతా వివిధ విభాగాల్లో పని చేస్తున్నారు. తమ మరణాంతరం అవయవదానం చేసేందుకు అంగీకారం తెలుపుతూ దరఖాస్తులపై సంతకాలు చేసి మానవీయత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బి.వి.గోవిందరాజులుకు గురువారం అందజేశారు. చాలా కాలంగా మానవీయత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అవయవదానంపై చేస్తున్న అవగాహన కార్యక్రమాలకు వీరు ఆకర్షితులయ్యారు. మరణించాక శరీరం అంతా మట్టిలో కలిసిపోవడం కంటే మరికొంత మందికి ఉపయోగపడడంతో పాటు ప్రయోగాలకు దోహదపడుతుందని ఆలోచన చేశారు. దీంతో అవయవదానం చేసేందుకు అంగీకార పత్రాలు అందజేశారు.

సస్పెండ్ చేశారు.. ఎత్తేశారు..!

- విద్యాశాఖాధికారుల తీరుపై పలు అనుమానాలు

కొత్తవలస: మండలంలోని వీరభద్రపురం ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు అనుచిత ప్రవర్తన, అసభ్యకర బోధన, సహ ఉపాధ్యాయినిను కులం పేరుతో కించపరిచే వ్యాఖ్యలు చేయడంపై జిల్లా విద్యాశాఖ అధికారికి ఫిర్యాదులు అందిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ జరిపిన డిప్యూటీ డీఈఓ, ఎంఈఓ ఇచ్చిన నివేదిక మేరకు ఆయనను గతేడాది డిసెంబర్ 20న సస్పెండ్ చేశారు. ఇప్పుడు ఏమైందో ఏమో తెలియదు.. ఆయనపై ఎలాంటి కేసు నమోదుకు సిఫార్సు చేయకుండానే తిరిగి విధుల్లోకి తీసుకున్నారు. పని సర్దుబాటు కింద చీపురుపల్లి మండలంలోని ముక్కాం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు పంపించేశారు. దీనిపై ఫిర్యాదు ఇచ్చిన ఉపాధ్యాయినితో పాటు గ్రామస్తులు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. అధికారుల తీరును తప్పుబడుతున్నారు. ఉపాధ్యాయుడి కీచకబుద్ధిని అధికారుల ముందు పిల్లలతో పాటు తల్లిదండ్రులు ఏకరువు పెట్టినా చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. కులంపేరుతో దూషించడం, అసభ్యకర మాటలతో అవమాన పర్చడంపై ఫిర్యాదు చేసినా విచారణ జరపలేదని, దళిత మహిళలను కావడం, రాజకీయ పలుకుపబడి లేకే ఉన్నతాధికారులు నా ఫిర్యాదును పరిగణనలోకి తీసుకోలేదని ఉపాధ్యాయిని యడ్ల కృష్ణవేణి వాపోయారు. ఇదే విషయాన్ని డీఈఓ మాణిక్యంనాయుడు వద్ద ప్రస్తావించగా ఉపాధ్యాయుడిపై వచ్చిన ఫిర్యాదు, ఆరోపణలపై జరిపిన విచారణలో చర్యలు తీసుకునేదిగా లేదని తేలిందన్నారు. సస్పెన్షన్ చేసిన ఉపాధ్యాయుడిని ఎక్కువ రోజులు గాలిలో ఉంచకూడదన్న ఉద్దేశంతో విధుల్లోకి తీసుకున్నామన్నారు. ఆయనకు ఒక అవకాశం ఇచ్చామని, మరోసారి ఆయనపై ఫిర్యాదులు అందితే కఠిన చర్యలు తీసుకుంటామని బదులిచ్చారు.

దుస్తులు, పాదరక్షలు పంపిణీ


వేపాడ: బొద్దాంలో విద్యార్థులకు పాదరక్షలు ,దుస్తులు అందజేస్తున్న ఎంఈఓ జగదీశ్వరరావు

వేపాడ: మండలంలోని తొమ్మిది మంది అనాథ విద్యార్థులకు బొద్దాం ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓ జగదీశ్వరరావు గురువారం దుస్తులు, పాదరక్షలు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు, దాతల సహకారంతో విద్యార్థులకు దుస్తులు, పాదరక్షలు సమకూర్చామని ఎంఈఓ చెప్పారు. బొద్దాం పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడిలో విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న ఎంపీడీఓ,ఎంఈఓ, దాత

గరివిడి మండలంలో..

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి డీఎఫ్ఎస్ మైనింగ్ మేనేజింగ్ డైరెక్టర్ విశ్వనాథంనాయుడు తన పుట్టినరోజు సందర్భంగా, సంక్రాంతి నేపథ్యంలో తల్లిదండ్రులు కోల్పోయిన తొమ్మిది మంది విద్యార్థులకు ఒక్కొక్కరికీ రెండు జతలు చొప్పున దుస్తులు సమకూర్చారు. విద్యావనరుల కేంద్రం వద్ద ఎంఈఓ పి.రామారావు ఆధ్వర్యంలో ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం విద్యార్థులకు వాటిని అందజేశారు.

సందడిగా సంక్రాంతి సంబరాలు

గజపతినగరం, చీపురుపల్లి, ఎస్.కోట నియోజకవర్గాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో గురువారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరా న్నంటాయి. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో సందడి చేశారు. రంగు రంగుల ముగ్గులు వేసి వాటిలో గొబ్బెమ్మలను పెట్టారు. భోగి మంటలు వేసి వాటి చుట్టూ చేరి నృత్యాలు చేశారు. హరిదాసులు, జంగమదేవరలు, తదితర వేషధారణలతో చిన్నారులు అలరించారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులు సంక్రాంతి విశిష్టతను విద్యార్థులకు వివరించారు.

–సాక్షి నెట్‌వర్క్


లక్కవరపుకోట: కొత్యాడ హైస్కూల్‌లో భోగి మంట చుట్టూ నృత్యం చేస్తున్న విద్యార్థులు


చీపురుపల్లి: కర్లాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో భోగి మంట చుట్టూ నృత్యం చేస్తున్న విద్యార్థులు


వేపాడ: సోంపురం ఉన్నత పాఠశాలలో హరిదాసు వేషధారణలో ఉన్న విద్యార్థికి కానుకలు ఇస్తున్న ఉపాధ్యాయులు


చీపురుపల్లి: చీపురుపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో వేసిన భోగి మంట


వేపాడ: బల్లంకిలో నిర్వహించిన సంబరాల్లో విద్యార్థుల సందడి


గజపతినగరం: పురిటిపెంట బాలికోన్నత పాఠశాలలో భోగి మంట వేస్తున్న హెచ్ఎం రమేష్ కుమార్


కొత్తవలస : కొత్తవలస హైస్కూల్‌లో భోగి మంట వద్ద విద్యార్థులు


కొత్తవలస: వాగ్దేవి కళాశాలలో సంబరాలు చేసుకుంటున్న విద్యార్థులు


శృంగవరపుకోట: ఎస్.కోట ఏవీఎన్ డిగ్రీ కళాశాలలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు


వేపాడ: దబ్బిరాజుపేట ప్రాథమిక పాఠశాలలో భోగి మంట చుట్టూ విద్యార్థులు, ఉపాధ్యాయులు


దత్తిరాజేరు: మోడల్ స్కూల్‌లో నిర్వహించిన సంబరాల్లో పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు

నేడు ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు


వేపాడలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో పుష్పాలంకరణ పనిలో సిబ్బంది

శృంగవరపుకోట/లక్కవరపుకోట/కొత్తవలస/వేపాడ: ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం నిర్వహించనున్న ఉత్సవాలకు ఎస్.కోట, ఎల్.కోట, కొత్తవలస, వేపాడ మండలాల్లోని వైష్ణవ ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆలయాలను పూలమాలలు, మామిడి తోరణాలతో అలంకరించారు. ఉత్తరద్వార దర్శనానికి ఏర్పాట్లు చేశారు. వేకువ జాము నుంచే పంచామృతాభిషేకములు, నవనీత సేవ, నక్షత్ర హారతి, కుంభహారతి, షోడషోపచార సేవలు, ప్రత్యేక పూజలు చేయనున్నారు.

రేకుల షెడ్డు కూల్చివేత


రేకులు షెడ్డును కూల్చివేసిన అధికారులు

బొండపల్లి: బొండపల్లి పంచాయతీ గొల్లలపేట గ్రామంలో సర్వే నంబర్ 574/5లో సెంటున్నర ప్రభుత్వ స్థలంలో వేసిన రేకుల షెడ్డును రెవెన్యూ అధికారులు పోలీసుల సాయంతో పొక్లెయిన్‌తో గురువారం తొలగించారు. అయితే, 13 ఏళ్లుగా అక్కడ షెడ్డు వేసుకుని వ్యాపారం చేస్తూ పొట్టపోషించుకుంటున్నానని, అధికార పార్టీ నాయకులు ఇచ్చిన ఫిర్యాదుకు తలొగ్గి తొలగించడం సమంజసం కాదని, ఉపాధికోల్పోయి ఇంటిల్లి పాదీ రోడ్డున పడ్డామంటూ బాధితుడు పీతల చంటిబాబు కన్నీటిపర్యంతమయ్యాడు. మండలంలో ఎన్నో చోట్ల ఆక్రమణలున్నా తన షెడ్డునే తొలగించడం తగదంటూ ఆర్ఐ హరికృష్ణ, ఎస్ఐ మహేష్‌కు గోడువినిపించాడు. ప్రభుత్వ స్థలం కావడంతో తామేమీ చేయలేమని వారు సమాధానం ఇచ్చారు.

సత్తాచాటిన మోడల్ స్కూల్ విద్యార్థులు


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ రామకృష్ణారావు

గంట్యాడ: మండలంలోని మదనాపురం మోడల్ స్కూల్ విద్యార్థులు జిల్లాస్థాయి రంగోత్సవ పోటీల్లో సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ రామకృష్ణారావు గురువారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో ఈనెల 7వ తేదీన నిర్వహించిన రంగోత్సవాల్లో చేతిరాత పోటీల్లో 10వ తరగతి విద్యార్థిని నిరీక్షణ, డిజిటల్ కాలేజ్ యూనిటీ ఇంటిగ్రిటీ పోస్టర్ మేకింగ్‌లో పదోతరగతి విద్యార్థిని బి.హాసిని ప్రథమస్థానంలో నిలిచారు. రోల్‌ప్లేలో 9వ తరగతి విద్యార్థి ఎం.గుణశేఖర్ ద్వితీయ, క్విజ్ పోటీల్లో 9వ తరగతి విద్యార్థులు ఎల్.పవన్, పి.శుభాకర్ ద్వితీయ స్థానాలు సాధించారు.ఈనెల24వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారు. విద్యార్థులను మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఫార్మసీలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఈశ్వరకుమార్

గజపతినగరం: ఫార్మసీ రంగంలో అపారమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయని డీన్ అకడమిక్ అఫైర్స్ ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.ఈశ్వర కుమార్ అన్నారు. సీతారామపురం గ్రామంలోని శ్రీసాయి ఫార్మసీ కళాశాలలో 2025 ఓరియంటేషన్ కార్యక్రమం గురువారం నిర్వ హించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొఫెసర్ ఈశ్వర కుమార్ కళాశాలలో నూతనంగా చేరిన విద్యార్థులకు ఫార్మసీ రంగంలో అవకాశాలు, కావాల్సిన నైపుణ్యం గురించి వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీదీప్తి, కళాశాల డైరెక్టర్ కె.వినోద్‌కుమార్,తదితరులు పాల్గొన్నారు.

బాలికల వికాసానికి సహకరించాలి


కిశోరి వికాసం వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మండల అధికారులు

కొత్తవలస: కిశోరి బాలికల వికాసానికి అంతా సహకరించాలని, బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేయాలని ఎంపీడీఓ రమణయ్య సూచించారు. వియ్యంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో కిశోరి వికాసం కార్యక్రమంపై మండలస్థాయి అధికారులు, మహిళా పోలీసులు,రెవెన్యూ,పంచాయతీ కార్యాదర్శులకు సీడీపీఓ ఆర్.ఉమాదేవి ఆధ్వర్యంలో గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ బాలికలకు 18 ఏళ్లు దాటిన తర్వాతే వివాహం చేసేలా గ్రామాల్లో తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలను, కిశోరి బాలికలు, బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాల్సిన ఆవశ్యకతను వివరించాలన్నారు. అనంతరం సంబంధిత వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. తహసీల్దార్ నీలకంఠరావు, పీహెచ్‌సీ వైద్యాధికారి సీతల్‌వర్మ, ఎంఈఓలు జి.శ్రీదేవి,బండారు శ్రీనివాసరావు, సహాయ సీడీపీఓ బి.లక్ష్మీబాయి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కె.రమణమ్మ,కె.వి.స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.